
'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 195

శనివారం 5-10-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'గంగనీళ్లకు వేళాయె..

అడెల్లి మహాపోచమ్మ తల్లి గంగనీళ్ల జాతరకు వేళయింది. శని, ఆదివారాల్లో జరిగే జాతరకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్నారు. - 2లో▸



వైద్యశాల భవన నిర్మాణమెప్పుడో

ఆయుర్వేద వైద్యశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరై ఏళ్లు గడుస్తోంది. టెండర్ పూర్తయినా పనులు ప్రారంభంలో జాప్యం జరుగుతోంది. - 5లో▸

న్యూస్‌రీల్

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

- డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్
- జిల్లాలోని వైద్యులతో సమావేశం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యులు సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, శస్త్రచికిత్సలను తగ్గించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల గైనకాలజిస్టులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలలో సాధారణ ప్రసవాలకు ప్రణాళిక సిద్ధం చేశామని, వంద శాతం సీ సెక్షన్ చేసిన ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృపాబాయ్, డాక్టర్ ఎస్.అనిత, డాక్టర్ సుధాకర్‌నాయక్, డాక్టర్ అనిల్, డాక్టర్ అరుణశ్రీ, డెమో బుక్క వెంకటేశ్వర్లు, 23 ప్రైవేటు ఆసుపత్రుల గైనకాలజిస్టులు పాల్గొన్నారు.

ఎనీమియా ముక్తికి కృషి చేయాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఎనీమియా ముక్తి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఐదేళ్లలోపు పిల్లల నుంచి 9 ఏళ్ల పిల్లలందరికీ పరీక్షలతోపాటు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఎనీమియా ముక్తి తెలంగాణ అవగాహన పోస్టర్లను శుక్రవారం వైద్యులు, వైద్య సిబ్బందితో కలిసి విడుదల చేశారు.

కొనసాగిన డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలన చేస్తున్న సిబ్బంది

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో డీఎస్సీ-2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారమూ కొనసాగింది. శనివారం నాటితో పరిశీలన ముగియనుంది. స్థానిక కార్మెల్ స్కూల్‌లో 17 ప్రత్యేక కేంద్రాలు సర్టిఫికెట్లు పరిశీలిస్తున్నాయి. హెచ్‌ఎంలు 34మంది, స్కూల్‌అసిస్టెంట్లు 17 మంది అభ్యర్థుల మార్కులు, ర్యాంకులు, నిజ ధ్రువీకరణ పత్రాలు పరిశీలన చేస్తున్నారు. మొత్తం 1:3 పద్ధతిన 721 అభ్యర్థులకు గాను 569 మంది సర్టిఫికెట్లను పరిశీలించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు సీఓఈ విద్యార్థి



భీమ్‌రావ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

బెల్లంపల్లి: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) పదో తరగతి విద్యార్థి కే.భీమ్‌రావ్ ఎంపికయ్యాడు. గత నెల 30న బొక్కలగుట్టలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అండర్-17 జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దూట శ్రీధర్ తెలిపారు. త్వరలో కొత్తగూడెం కేంద్రంగా రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరుగుతాయని ప్రకటించారు. విద్యార్థిని వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అల్లూరి వామన్, ఉపాధ్యాయులు అభినందించారు.

నామినేటెడ్ ఆశలు



- 'హస్తం' నాయకులను ఊరిస్తున్న పదవులు
- రెండో విడత భర్తీలో అవకాశంపై చర్చ
- ఉమ్మడి జిల్లా నాయకుల ఎదురుచూపులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నాయకులు, కార్యకర్తలు నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి మరో రెండు నెలలైతే ఏడాది కావొస్తుంది. ఇప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎవరికీ రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కలేదు. ఇక సీనియర్ నాయకులు రాష్ట్ర స్థాయి పలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. తొలి విడతలో మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం అల్లీపూర్‌కు చెందిన కోట్నాక తిరుపతిని ప్రభుత్వం రాష్ట్ర గిరిజన ఆర్థిక సహకార కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియమించింది. ఆయన ఏఐసీసీ ఆదివాసీ జాతీయ సమన్వయ కర్తగా ఉంటూ, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడో యాత్రలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన కష్టానికి గుర్తింపుగా ఈ పదవి వరించింది. ఈయన మినహా ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులెవరికీ అవకాశం రాలేదు. ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకుని ఉంటున్న వారికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇప్పటికే పలువురు నాయకులు తమకు తెలిసిన పెద్దలతో గాంధీ భవన్ దాకా వెళ్లి పైరవీలు చేసుకుంటున్నారు. ఇక కొందరు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, మార్కెట్ కమిటీలు, ఇతర పాలవకర్గాల్లో చోటు కోసం వేచి ఉన్నారు.

మలి విడతలో ఎవరికో..

రెండో విడత పదవుల పంపకాల్లో సీనియర్లు పదవుల కోసం పోటీలో ఉన్నారు. ఆదిలాబాద్ ఎంపీ స్థానానికి పోటీ చేసిన ఆత్రం సుగుణ, కుమురంభీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు కే.విశ్వప్రసాద్‌రావు, ఆసిఫాబాద్ నుంచి పోటీ చేసిన శ్యామ్‌నాయక్, సిర్పూర్ నుంచి పోటీ చేసిన రావి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు నిర్మల్ నుంచి పోటీ చేసి ఓడిన కూచాడి శ్రీహరిరావు, ముథోల్ నుంచి పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్, బోథ్ నుంచి పోటీ చేసిన అడె గజేందర్, మంచిర్యాల నుంచి డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, కేవీ ప్రతాప్, తదితర నాయకులు ఉన్నారు. వీరిలో ఎవరికైనా రెండో విడతలో అవకాశం ఉంటుందా? అని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

వలస నేతలకు అవకాశం లేదా?

గత సర్కారులో ఉమ్మడి జిల్లాలో కీలకంగా ఉన్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో సహా ఖానాపూర్, ముథోల్, బోథ్, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యేలు రేఖానాయక్, విఠల్, రాథోడ్ బాపురావు, కోనేరు కోనప్ప తదితర నాయకులు సైతం సీనియర్లుగా ఉన్నారు. అయితే వీరంతా బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన వారు. ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకున్న వారికే మొదట అవకాశం కల్పించాలని నాయకులు కోరుతున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో అందరికీ తగిన న్యాయం చేస్తామని అధిష్టానం నుంచి హామీ ఉందని పార్టీ మారిన నాయకులు అంటున్నారు. ఈ క్రమంలో వలస నేతలపై అధిష్టానం ఎలా కరుణిస్తుందో వేచి చూడాలి.

దుర్గం భాస్కర్‌కు ఖాయమేనా?

ఓయూ జేఏసీ, పార్టీలో విద్యార్థి నాయకుడిగా ఉన్న ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌కు చెందిన దుర్గం భాస్కర్‌కు నామినేటెడ్ పదవి దాదాపు ఖాయమైనట్లుగానే చెబుతున్నారు. ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూరు నుంచి టికెట్ ఆశించగా, పార్టీ కేటాయించలేదు. దీంతో 'ఓయూ' కోటాలో తొలి విడతలోనే ఆయనకు నామినేటెడ్ పదవుల్లో చోటు దక్కుతుందని ప్రచారం జరిగింది. కానీ అవకాశం రాలేదు. త్వరలో ప్రకటించే రెండో విడతలో ఆయన పేరు ఖాయంగా ఉంటుందని విద్యార్థి నాయకులు అంటున్నారు.

సర్వే సకాలంలో పూర్తి చేయాలి

- తప్పులు దొర్లకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పరిశీలన



మంచిర్యాలలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

మంచిర్యాలటౌన్/దండేపల్లి: జిల్లాలో చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు సర్వే సకాలంలో పూర్తి చేయాలని, తప్పులు దొర్లకుండా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ఆయన మంచిర్యాలలోని 16వ వార్డు అశోక్‌రోడ్డులో, దండేపల్లి మండలం అల్లీపూర్, కళపల్లి గ్రామాల్లో డిజిటల్ కార్డుల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఒక గ్రామం, మున్సిపల్ వార్డు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. సర్వే నివేదిక ఈ నెల 9న అందించాలని, ఒక కుటుంబానికి ఒక కార్డు ఉంటుందని, ప్రతీ సభ్యుడికి ఒక ప్రత్యేక నంబరు కేటాయిస్తారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కార్డు అనుసంధానమై ఉంటుందని తెలిపారు. జాబితా ప్రకారం పేర్లు వివరాలు సరిచూసుకోవాలని అన్నారు. కళపల్లి గ్రామస్తులు విద్యుత్ లోవోల్టేజీ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఎస్‌ఈతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. దండేపల్లి కేజీబీవీలో డార్మెటరీ భవన నిర్మాణ పనులు పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయించాలని తెలిపారు. దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసి సిబ్బంది హాజరు రిజిష్టరు పరిశీలించారు. జ్వరాల కేసుల నమోదు తదితర వివరాలపై వైద్యాధికారి సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మంచిర్యాల ఆర్డీవో రాములు, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, దండేపల్లి ఎంపీడీవో ప్రసాద్ పాల్గొన్నారు.

కరోనా లేదు.. దారి వదలండి..!



తాత్కాలికంగా మూసి ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి

- మూసి ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి
- ఐదేళ్లుగా ప్రజల ఇబ్బందులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి అశోక్‌నగర్ బస్తీ శివారులోని రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలపై నిషేధం ఇంకా కొనసాగుతోంది. కరోనా ప్రబలిన సమయంలో రాకపోకలను నియంత్రించాలనే ఉద్దేశంతో రైల్వే అండర్ బ్రిడ్జి ఐదేళ్ల క్రితం తాత్కాలికంగా మూసివేతకు గురైంది. కరోనా కనుమరుగైనా రాకపోకలు పునరుద్ధరించే విషయంలో అధికారులకు పట్టింపు కరువైంది. హైదరాబాద్-న్యూఢిల్లీ రైల్వే మార్గం బెల్లంపల్లి మీదుగా ఉండడంతో సుమారు తొమ్మిది దశాబ్దాల క్రితం అండర్ బ్రిడ్జి నిర్మించారు. 2019లో కరోనా వైరస్ ప్రబలడంతో అనివార్య పరిస్థితుల్లో రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలను నియంత్రించారు. బ్రిడ్జికి అడ్డంగా ఇనుప దిమ్మెలు ఏర్పాటు చేయడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. దీంతో బజార్‌ఏరియా నుంచి కాల్‌టెక్స్ ఏరియాకు వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాకపోకలు కొనసాగిన సమయంలో కాల్‌టెక్స్ ఏరియా వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల పరంగా ఓ వెలుగు వెలిగింది. ఏ సమయంలో చూసినా రద్దీగా ఉండేది. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను తీసుకెళ్లడానికి, అత్యవసర సమయంలో సులువుగా రాకపోకలకు వీలు పడేది. నేరుగా మందమర్రి, మంచిర్యాల, తాండూర్ వైపు వెళ్తుండడంతో కాల్‌టెక్స్‌లో వ్యాపార కార్యకలాపాలపై ప్రభావం పడింది. గిరాకీ లేక వ్యాపారాలు డీలా పడ్డాయి. రైల్వేపై ఓవర్ బ్రిడ్జి ఉన్నా ఈదారి గుండానే వెళ్తుంటారు.

కొనసాగుతున్న మూడో రైల్వే లైన్ పనులు

కాజీపేట-బల్లార్షా సెక్షన్ రైల్వే మూడో లైన్ నిర్మాణ పనులు బెల్లంపల్లి స్టేషన్ పరిధిలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ట్రాక్ నిర్మిస్తున్నారు. కొద్ది రోజులుగా మట్టి, కంకర, సిమెంట్ పనులు చేస్తున్నారు. ఆ ట్రాక్ పనులు పూర్తయితే రైల్వే అండర్‌బ్రిడ్జి నుంచి రాకపోకలు ప్రారంభిస్తారా లేక ప్రస్తుత పరిస్థితినే కొనసాగిస్తారా అని ప్రజలు, వాహనదారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలకు రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాకపోకలు అనుమతించాలి



రైల్వే అండర్ బ్రిడ్జి కింది నుంచి వాహనాల రాకపోకలకు వీలుగా రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేయాలి. అత్యవసరంగా వెళ్లడానికి అనేకమంది ఈ మార్గాన్ని ఎంచుకుంటారు. స్కూల్ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకు సౌకర్యంగా ఉంటుంది. బ్రిడ్జి కింది నుంచి రాకపోకలకు అనుమతించడం వల్ల కాల్‌టెక్స్ ఏరియాకు పూర్వ వైభవం వచ్చే అవకాశాలు ఉంటాయి.

– సురేష్ అగర్వాల్, బెల్లంపల్లి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో రోడ్లు, భవనాలు, పోలీస్, ట్రాఫిక్, జాతీయ రహదారులు, రవాణా, అబ్కారీ-మద్యనిషేధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులపై కొన్ని ప్రాంతాల్లో సరైన విద్యుత్ దీపాలు లేక ప్రమాదాలకు అవకాశం ఉంటుందని, సకాలంలో విద్యుత్ దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రహదారులపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని, మూలమలుపు, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో సూచిక బోర్డులు, వాహనాల వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో షాపింగ్ మాల్స్, బహుళ అంతస్తుల భవనాల్లో పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, మార్కెట్ ప్రాంతాల్లో రోడ్లపై కూరగాయలు, ఇతర వ్యాపారాలు జరుపకుండా ప్రత్యేక స్థలాలు కేటాయించాలని అన్నారు. జన్నారం-పానకల్ బస్టాండ్ ప్రాంతంలో ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో అనుమతి లేని లే-అవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్) ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో డీపీవో వెంకటేశ్వరావు, పట్టణ ప్రణాళిక అధికారి డీటీసీపీ అధికారి బి.సంపత్, నీటి పారుదల శాఖ ఏఈఈ, రెవెన్యూ శాఖ ఆర్‌ఐలతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

పంచాయతీలకు నిధులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని పంచాయతీలకు ఎట్టకేలకు నిధులొచ్చాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.3,49,64,331 మంజూరయ్యాయి. రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంట్ కింద విడుదల చేస్తూ పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ అనితారామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాక్టర్ కిస్తీలతోపాటు మల్టీపర్పస్ కార్మికుల జీతాలు, విద్యుత్ చార్జీలు, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలకు వినియోగించాలని పేర్కొన్నారు. జిల్లాలో 55 గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్ కిస్తీల చెల్లింపులకు రూ.15,85,366, జిల్లాలోని 311 పంచాయతీలకు కరెంటు చార్జీలకు రూ.63,12,000, మల్టీపర్పస్ కార్మికులు 1,092 మంది జీతాలకు రూ.1,09,92,889 మంజూరు చేశారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలకు జనాభా ప్రాతిపదికన విడుదల చేశారు. 3వేలలోపు జనాభా ఉన్న గ్రామానికి రూ.50 వేలు, 3 నుంచి 8 వేలలోపు జనాభా ఉంటే రూ.75 వేలు, 8 వేలకు పైగా ఉంటే రూ.లక్ష కేటాయించారు. ఇప్పటికే పంచాయతీలకు సంబంధించి పలు చెక్కులు పాస్ కాకుండా ట్రెజరీల్లో పెండింగ్ ఉన్నాయి. ఈ నిధులకు సంబంధించి కూడా చెక్కులు పాస్ అవుతాయో లేదో అన్న అనుమానాలు ఉన్నాయి.

కాంగ్రెస్ పాలనపై విసిగిపోయిన ప్రజలు

- ఆదిలాబాద్ ఎంపీ గెడం నగేశ్
- జన్నారంలో బీజేపీ సభ్యత్వ నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

జన్నారం: కాంగ్రెస్ తొమ్మిది నెలల పాలనలో ప్రజలు విసిగిపోయారని, ఒక్క కొత్త పథకం కూడా అమలు చేయని దద్దమ్మ పాలన చేస్తోందని ఆదిలాబాద్ ఎంపీ గెడం నగేశ్ విమర్శించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ నగేశ్ మాట్లాడుతూ ప్రతీ పల్లె బీజేపీ వైపు చూస్తోందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు విరివిగా చేయాలని అన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారని, రూ.కోట్లు తెలంగాణ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని గ్రామాల్లో ప్రచారం చేయాలని, పార్టీకి కార్యకర్తలే బలం అని, ఏ సమస్య ఉన్నా చెప్పుకుంటే పరిష్కారం చేస్తామని అన్నారు. అర్ధరాత్రి అయినా తన ఇంటి తలుపు తట్టవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుండవరపు మధుసూదన్‌రావు, నియోజకవర్గ ఇంచార్జి రితీశ్ రాథోడ్, అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, బీజేపీ జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, కార్యదర్శులు రమేశ్‌గౌడ్, దేవేందర్, జగన్, బీజేవైఎం అధ్యక్షుడు ముడుగు ప్రవీణ్, మాజీ అధ్యక్షులు వీరాచారి, గోలి చందు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన



నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

చెన్నూర్: చెన్నూర్ శనిగకుంట పేల్చివేత కేసులో అధికార పార్టీ నా యకులను వదిలి అమాయక బీఆర్‌ఎస్ నాయకులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడంపై శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. చెన్నూర్, చెన్నూర్ రూరల్ సీఐలు రవీందర్, సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకుని బీఆర్‌ఎస్ నాయకులను స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి, పోలీసులకు వ్య తిరేకంగా నినాదాలు చేశారు. తోపులాట లో కౌన్సిలర్ దొమకొండ అనిల్ అస్వస్థతకు గురై కింద పడిపోయాడు. నాయకులు నీళ్లు తాగించి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు నియోజకవర్గ నాయకులు రాజారమేశ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ నవాజ్, కౌన్సిలర్ రెవెల్లి మహేశ్, మాజీ సర్పంచ్ కృష్ణ, మాజీ ఎంపీపీ బాపు, భీమారం మండల పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు నా యిని సతీశ్, బొగె భారతి, తుమ్మ రమేశ్, జోడు శంకర్, ఆరీఫ్, జిలా ని, వీరమల్ల రాము, నాయబ్, సాయిరెడ్డి, సరేశ్, అనంపల్లి సంపత్‌లను అదుపులోకి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

సన్న రకం ధాన్యమే అధికం

- ఈ ఏడాది రెండు రకాల ధాన్యం సేకరణ
- ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తేనే రైతులకు మేలు



కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం(ఫైల్)

మంచిర్యాలఅగ్రికల్చర్: వరిధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. సన్న రకం, దొడ్డు రకం ధాన్యం సేకరణ వేర్వేరుగా చేపట్టాలని, సన్నరకానికి మద్దతు ధర కంటే అదనంగా రూ.500 బోనస్ చెల్లించాలని నిర్ణయించింది. జిల్లాలో 90శాతం సన్నరకం వరి సాగు విస్తీర్ణం ఉంది. మరో నెల రోజుల్లో పంట దిగుబడి రానుంది. సన్నరకం, దొడ్డు రకం ధాన్యం గుర్తించేందుకు అధికారులు ముందస్తుగా ప్రణాళిక రూపొందించడం, నిర్వాహకులకు శిక్షణ, సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. గతంలో ధాన్యం సేకరణలో అక్రమాలు జరిగాయి. రైతులు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సంఘటనలు ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి కేంద్రాల ద్వారా మద్దతు ధరతో మిల్లుకు తరలించిన ఆరోపణలు వచ్చాయి. ఈ ఏడాది దొడ్డు రకంతోపాటు సన్నరకం ధాన్యం ఎక్కువగా సాగు కావడంతో కొనుగోలు కేంద్రాలకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. గతంలో సన్న రకం ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్న రైతులు మద్దతు ధరకు అదనంగా రూ.500 లభిస్తుండడంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది. దీనికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు, హమాలీ, తూకం, గన్ని సంచులు, లారీలు, మిల్లుల ట్యాగింగ్, తదితర ముందస్తు ఏర్పాట్లు చేపట్టాల్సి ఉంది. గతంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందుల దృష్ట్యా ఆయా ఏజెన్సీల నిర్వాహకులకు జిల్లా, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించాల్సి ఉంది. జిల్లాలో ఆలస్యంగా వరి సాగు చేయడం వల్ల వచ్చే నెల మూడో వారం నుంచి దిగుబడి రానుంది. ఇందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాల కేటాయింపు, గన్ని బ్యాగులు సమకూర్చుకోవాల్సి ఉంది.

కొనుగోలు కేంద్రాలకే ఎక్కువ..

ఖరీఫ్‌లో దొడ్డు రకంతోపాటు సన్నరకం వరి సాగు చేసిన రైతులు ఇంటి అవసరాలతోపాటు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించారు. ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తక్కువగా వస్తుండగా రబీ సీజన్‌లో ఎక్కువగా వస్తుంది. గతేడాది వరిధాన్యం ప్రభుత్వ మద్దతు ధర దొడ్డురకం క్వింటాల్‌కు రూ.2,125, సాధారణ రకం రూ.2,183 ఉండగా ఈ ఏడాది దొడ్డు రకం రూ.2275, సన్న రకం రూ.2300గా నిర్ణయించింది. సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ ప్రభుత్వం చెల్లించనుంది. దీంతో సన్న రకానికి క్వింటాల్‌కు రూ.2800 ధర దక్కనుంది. గతంలో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు రూ.2,300 నుంచి రూ.2,600 మధ్య ధరతో విక్రయించారు. ప్రస్తుతం ప్రభుత్వమే రూ.2,800 చెల్లించనుండడంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించనున్నారు. రైతులు సాగు చేసిన సన్నరకం దిగుబడి వచ్చిన ధాన్యాన్ని గుర్తించి కోత సమయంలోనే టోకెన్లు జారీ చేస్తే అక్రమాలకు తావులేకుండా ఉండే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో వరి సాగు(ఎకరాల్లో)

దొడ్డు రకం	సన్నరకం	మొత్తం
17,820	1,38,989	1,56,809

డ్రైవింగ్‌లో ఏకాగ్రత ఎంతో అవసరం

- రామగుండం సీపీ శ్రీనివాసులు
- ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రం అందజేస్తున్న సీపీ శ్రీనివాసులు

బెల్లంపల్లి: డ్రైవింగ్‌లో ఏకాగ్రత ఎంతో అవసరమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పనికి రాదని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని రామంగుండం సీపీ ఎం.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలోని కమిషరేట్ ఆర్మ్‌డ్ రిజర్వు(సీఏఆర్) పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని డ్రైవర్లకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనంలో ప్రయాణించేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు ముందు, పరిసరాలను నిశితంగా గమనిస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రతీ వాహనదారుడు పోలీసులను ఆదర్శంగా తీసుకునేలా వ్యవహరించాలని పేర్కొన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, సీట్ బెల్ట్ విధిగా ధరించాలని, డ్రైవర్ పక్కన కూర్చుండే అధికారులు సైతం సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. పలువురు ఉత్తమ డ్రైవర్లకు సీపీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య, ఆర్‌ఐ ఎంటీవో సంపత్, ఆర్‌ఐ వామనమూర్తి, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

కాసిపేట: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సి.రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్రరావు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఎస్సై అంజనేయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

గుడిహత్నూర్: మండలంలోని మల్కాపూర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మడావి దశరథ్ కుటుంబ సభ్యులతో పెంకుటిల్లులో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం దశరథ్ ఇంటి బయట మంచంలో పడుకుని ఉండగా భార్య మంచినీరు కోసం బోరుబావి వద్దకు వెళ్లింది. ఆమె తిరిగి రావడంతో ఇంట్లో మంటలు, పొగ రావడం ఇరుగు పొరుగు వారిని పిలిచింది. గ్రామస్తులంతా కలిసి మంటలార్పివేశారు. ఇంట్లో ఆహారధాన్యాలు, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని భార్యభర్తలు వేడుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల నగదు అందజేశారు.

థర్మల్ విద్యుత్ ప్లాంటు నిర్మించాలి

మందమర్రిరూరల్: జెన్‌కో ఆధ్వర్యంలో రామగుండంలో థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మించాలని మంచిర్యాల ఏడీఈ రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఊరు మందమర్రి లోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉద్యోగులతో కలిసిన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా రామగుండంలో కాలం చెల్లిన 55.5 మెగా వాట్స్ థర్మల్ ప్లాంట్‌ను ప్రభుత్వం డిస్మెంటల్ చేసి దాని స్థానంలో మరో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్‌ను నిర్మించడానికి సన్నహాలు చేస్తోందన్నారు. ఈ ప్లాంట్ నిర్మాణ బాధ్యతలు జెన్‌కోకి అప్పగించాలని కోరారు. ఇందులో సింగరేణి, ప్రభుత్వం కలిసి థర్మల్ ప్లాంట్ నిర్మించాలని చూస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. సబ్‌స్టేషన్ ఏఈ వేముల మౌనిక, ఎల్ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఎంపీడీవో మృతి


ముజఫర్‌ఉద్దీన్ (ఫైల్)

బాల్కొండ: నిజామాబాద్ జిల్లా ముప్కాల్ ఎంపీడీవో ముజఫర్ ఉద్దీన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నివాసముండే ఎంపీడీవో గత సోమవారం విధులకు హాజరయ్యేందుకు మండల కేంద్రానికి బస్సులో వచ్చాడు. ముప్కాల్‌లో బస్సు దిగి కార్యాలయం వైపు రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొంది. ఈ ఘటనలో అతని తలకు తీవ్రగాయాలు కావడంతో నిర్మల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజనీకాంత్ పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 9030612463 [M-1185464]

■ ఒమేగా హోమ్‌కేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ ఫుడ్ వసతి. జీ: 18K. ఫోన్: 8977639662 [SCA-24000291]

■ Walkin interview for ELECTRICIAN & MECHANIC Contact : 7989896938/ 9542341512 [HA-4880]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

‘గంగనీళ్ల’కు వేళాయె..


ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు


నూతనంగా నిర్మించిన అడెల్లి మహాపోచమ్మ ఆలయం అర్థమండపం


ఆలయం ప్రాంగణంలో కోనేరు ఇదే

- నేటి నుంచి జాతర
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- అడెల్లిలో ఏర్పాట్లు పూర్తి

సారంగపూర్/దిలావర్‌పూర్: భక్తులపాలిట కొంగు బంగారంగా పేరొందిన అడెల్లి మహా పోచమ్మతల్లి గంగనీళ్ల జాతరకు వేళయింది. శని, ఆదివారాల్లో నిర్వహించనున్న జాతరకు భక్తులు భారీగా తరలిరానున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సారంగపూర్ మండలంలోని అడెల్లి సమీపంలో సహ్యాద్రి పర్వతశ్రేణిని ఆనుకుని అటవీప్రాంతంలో వెలసిన అడెల్లి మహాపోచమ్మ తల్లికి ఏటా విజయదశమి పర్వదినం ముందు మహాలయ అమావాస్య తర్వాత ఈ జాతర నిర్వహించడం ఆనవాయితీ. శనివారం ఉదయం అమ్మవారి నగలను గోదావరినదిలో శుద్ధికి తరలించడంతో జాతర ప్రారంభమవుతుంది. ఆదివారం సాయంత్రంతో ముగుస్తుంది.

తరలిరానున్న భక్తజనం

గంగనీళ్ల జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ నుంచే కాక మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. స్థానికులు ఎడ్లబండ్లపై ఈ జాతరకు రావడం ప్రత్యేకతగా చెప్పవచ్చు. దూరప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల ద్వారా ఆలయానికి చేరుకుంటారు. భక్తులు అమ్మవారికి పాయసం, సల్లనంబళ్లు, నైవేద్యం సమర్పిస్తారు.

ఏర్పాట్లు పూర్తి

భక్తులకు ఇబ్బంది లేకుండా ఈవో రమేశ్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని కేటాయించారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై శ్రీకాంత్ బందోబస్తు నిర్వహించనున్నారు.

అమ్మవారి నగలు తరలింపు ఇలా..

అడెల్లి ఆలయం నుంచి అమ్మవారి నగలను బాజాభజంత్రీలతో ఊరేగింపుగా 12 మంది అర్చక బృందం సభ్యులు, భక్తులు గోదావరి నదికి తరలిస్తారు. ఈ ఊరేగింపు అడెల్లి, సారంగాపూర్, యాకర్‌పెల్లి, వంజర్, ప్యారమూర్ గ్రామాల మీదుగా దిలావర్‌పూర్ మండలం కదిలి, మాటేగాం, దిలావర్‌పూర్, కంజర్, సాంగ్వి గ్రామానికి చేరుస్తారు. సాంగ్విలో శనివారం రాత్రి భక్తుల మధ్య అమ్మవారి నగలను ఆలయంలో ఉంచి పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి గోదావరి నదిలో నగలను శుద్ధిచేస్తారు. తిరిగి ఆదివారం ఉదయం గోదావరి జలాలతో శుద్ధి తర్వాత బాజాభజంత్రీల మధ్య ఊరేగింపుగా సాయంత్రానికి అడెల్లి ఆలయానికి చేరుస్తారు.

ఆలయానికి చేరేదిలా..

నిర్మల్ నుంచి అడెల్లి ఆలయం 20 కి.మీ దూరంలో ఉంటుంది. నిర్మల్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ప్రైవేటు వాహనాల్లో వచ్చేవారు పాత ఎన్‌హెచ్–7 దారిలో 4 కి.మీ ప్రయాణించాలి. అక్కడి నుంచి అడెల్లి ఆలయ స్వాగత తోరణం కింది నుంచి సారంగాపూర్ చేరుకోవాలి. అటు నుంచి మరో స్వాగత తోరణం నుంచి ఆలయానికి చేరుకోవచ్చు. భైంసా నుంచి ఆర్టీసీ బస్సులను నడుపుతోంది. ఇక్కడి నుంచి వచ్చే వాహనదారులు కల్లూరు, కుంటాల, గొల్లమాడ, మండలంలోని కంకెట, మలక్‌చించోలి గ్రామాల మీదుగా సారంగాపూర్‌కు, అక్కడి నుంచి ఆలయానికి చేరుకోవచ్చు.

పాపాలను హరించే పుణ్యకోనేరు

ఆలయ ప్రాంగణంలో పుణ్యకోనేరుకు ఎంతో ప్రాశస్త్యాన్ని కలిగి ఉంది. అమ్మవారే స్వయంగా స్నానం ఆచరించే ఈ కోనేరు నీటితో స్నానం చేస్తే సకల పాపాలు, సర్వరోగాలు మటుమాయం అవతాయనేది భక్తుల విశ్వాసం.

బయట నుంచే దర్శనం..

ఆలయ నిర్మాణ నేపథ్యంలో బాలాలయంలో భక్తుల ప్రవేశాన్ని అధికారులు నిషేధించారు. సంయమనం పాటించి బయటనుంచే అమ్మవారిని దర్శించుకోవాలి. పవిత్ర కోనేరులో స్నానమాచరించి అమ్మవారి పూజిస్తే అనుగ్రహం లభిస్తుంది.
– శ్రీనివాస శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

కల్పకుంటలో బర్డ్ వాచింగ్


కార్యక్రమంలో పాల్గొన్న అటవీ అధికారులు

కడెం: వన్యప్రాణి సప్తలో భాగంగా మండలంలోని ఉడుంపూర్ రేంజ్ అటవీ రేంజ్ ఆధ్వర్యంలో కల్పకుంట వద్ద శుక్రవారం బర్డ్ వాచింగ్ కార్యక్రమం నిర్వహించారు. అటవీ అధికారులు వివిధ రకాల పక్షులను గుర్తించారు. డీఆర్వోలు ప్రకాశ్, చంద్రమౌళి,సిబ్బంది సురేందర్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కడెం అడవుల సందర్శన


వాచ్‌టవర్ వద్ద సత్యనారాయణరావు

కడెం: హైకోర్టు పీపీ సత్యనారాయణరావు శుక్రవారం కుటుంబ సమేతంగా కడెం అడవులను సందర్శించారు. మండలంలోని గంగాపూర్, లక్ష్మీపూర్ వాచ్‌టవర్లు, గడ్డిక్షేత్రాలు, బేస్ క్యాంప్‌లను పరిశీలించారు. వీరి వెంట ఎఫ్ఆర్వో గీతారాణి, డీఆర్వో సిద్ధార్థ, అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు


శ్రీకాంత్‌కు నచ్చజెప్పతున్న పోలీసులు

దండేపల్లి: బంధువులతో గొడవపడి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తి ప్రాణాలను పోలీసులు కాపాడారు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం..చొప్పదండికి చెందిన డ్రైవర్ నామసాని శ్రీకాంత్ బెల్లంపల్లిలో బంధువుల ఇంటికి వెళ్లి అక్కడ వారితో గొడవపడ్డాడు. మనస్తాపం చెందిన అతడు శుక్రవారం దండేపల్లి మండలం గూడెం గోదావరి నది వద్దకు చేరుకున్నాడు. నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేశాడు. దీంతో వారు వెంటనే 100 డయల్‌కు సమాచారం అందించారు. దండేపల్లి, లక్సెట్టిపేట బ్లూకోల్ట్స్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. శ్రీకాంత్‌ను దండేపల్లి పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం అతన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వ్యక్తి ప్రాణాలను కాపాడిన బ్లూకోల్ట్స్ సిబ్బంది శేఖర్, లక్ష్మయ్య, బ్రహ్మం, రత్నాకర్‌ను లక్సెట్టిపేట సీఐ నరేందర్, దండేపల్లి, లక్సెట్టిపేట ఎస్సైలు ఉదయ్‌కిరణ్, సతీశ్ అభినందించారు.

శనిగకుంట మత్తడి పేల్చివేతలో మరో ముగ్గురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

జైపూర్: చెన్నూర్ పట్టణంలోని శనిగకుంట మత్తడి పేల్చివేత కేసులో మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక అసిస్టెంట్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో చెన్నూర్ సీఐ రవీందర్‌తో కలిసి ఈ మేరకు వివరాలు వెల్లడించారు. గత నెల 16న చెన్నూర్‌లోని శనిగకుంట చెరువు మత్తడిని గుర్తుతెలియని వ్యక్తులు డిటోనేటర్లు పెట్టి పేల్చివేశారు. ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మొత్తం 14 మంది నిందితులను గుర్తించగా, పలు దఫాలుగా 11 మందిని అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఈ కేసులో ఇద్దరు ప్రధాన నిందితులు బత్తుల సమ్మయ్య ఏ5, రాంలాల్ గిల్డా ఏ6, మరో నిందితుడైన ఎన్నం బానయ్య ఏ14లను అదుపులోకి తీసుకున్నట్లుగా వివరించారు. ఈ మేరకు వారిని రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో చెన్నూర్ ఎస్సై శ్వేత తదితరులు పాల్గొన్నారు.

లాభాల్లో అంకెల గారడి

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

శ్రీరాంపూర్: కంపెనీ సాధించిన లాభాల్లో ఈసారి అంకెల గారడి చేశారని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కంపెనీ మొత్తం లాభాల రూ.4701 కోట్లని ఇందులో నుంచి ప్రభుత్వం ప్రకటించిన 33 శాతం వాటా కింద రూ.1551 కోట్లు కార్మికులకు పంచాల్సి ఉండగా కేవలం రూ.796 కోట్లు పంచుతున్నారన్నారు. ఈ లెక్కన కార్మికులకు పంచేది కేవలం రూ.17 శాతం వాటానే అన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, ప్రభుత్వం కలిసి మోసం చేశాయన్నారు. వాస్తవ లాభాల నుంచి కార్మికులకు వాటా పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, అన్వేశ్‌రెడ్డి, సాధుల భాస్కర్, ఉత్తేజ్‌రెడ్డి రాజునాయక్, బిరుద శ్రీనివాస్ పాల్గొన్నారు.

లాభాల వాటాపై అసత్యప్రచారం తగదు

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య


మాట్లాడుతున్న సీతారామయ్య

కాసిపేట: దేశంలో ఏ సంస్థలో లేని విధంగా సింగరేణి కార్మికులకు ఏఐటీయూసీ నాయకుడు కామ్రేడ్ కేఎల్ మహేంద్ర కృషితో లాభాల వాటా సాధ్యమైందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొన్ని కార్మికసంఘాలు ఈ సంవత్సరం ఇస్తున్న లాభాల వాటాపై అసత్య ప్రచారం చేస్తున్నాయన్నారు. గత 24 ఏళ్లుగా ఇచ్చిన విధంగానే ఈ సంవత్సరం లాభాల వాటాను కార్మికులకు చెల్లించామని తెలిపారు. కార్మికులకు పెర్క్స్‌పై ఆదాయపన్ను కంపెనీ చెల్లించేలా పోరాటం చేస్తామన్నారు. దసరా అడ్వాన్స్‌పై ఆదాయపన్ను పడుతుందని కొన్ని సంఘాలు అసత్య ప్రచారం చేయడంపై మండిపడ్డారు. సమావేశంలో బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి సహాయ కార్యదర్శి దాసరి తిరుపతిగౌడ్, కోశాధికారి నాగేశ్వర్‌రావు, గని ఫిట్‌కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, కాసిపేట–2 ఫిట్ సెక్రెటరీ శ్రీనివాస్, నాయకులు రంజిత్, శ్రీనివాస్, సంపత్, సంతోష్, రాజన్న, రవీందర్, రవివర్మ పాల్గొన్నారు.

వైద్యం అందక నరకయాతన


ఎడ్లబండిపై దుర్గయ్య


దుర్గయ్యను అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న సిబ్బంది

- యువకుడికి ఫిట్స్, ఎడ్లబండిపై నిరీక్షణ
- రోడ్డు సరిగ్గా లేకనే ఆలస్యంగా వచ్చిన అంబులెన్స్
- ఆలుగామలో ఘటన

కోటపల్లి: ఫిట్స్ వచ్చిన యువకుడికి వైద్యం అందక నరకయాతన పడ్డాడు. ఈ ఘటన మండలంలోని అలుగామలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన అంబాల పోసక్క కుమారుడు దుర్గయ్య(30) కూలీగా పనిచేస్తూ పశువుల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ప్రతీరోజులాగా శుక్రవారం పని నిమిత్తం వెళ్లగా గ్రామశివారులో ఫిట్స్ వచ్చి కింద పడిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. తల్లి పోసక్క మూగవాడి అయిన పెద్దకుమారుడితో ఎడ్లబండిపై వెళ్లి దుర్గయ్యను గ్రామానికి తీసుకువచ్చింది. విషయం తెలుసుకున్న పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ రమణి అతడికి బీపీ పరీక్ష చేసింది. రమణితోపాటు గ్రామానికి చెందిన యువకుడు రాజు అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. పార్‌పల్లి నుంచి ఎదులబంధం వరకు రోడ్డు సౌకర్యం సరిగ్గా లేదు. అంబులెన్స్ రావడానికి రెండున్నర గంటల సమయం పట్టింది. అప్పటికే దుర్గయ్య ఎడ్లబండిపై పడుకుని నిరీక్షించాడు. చివరకు గ్రామానికి అంబులెన్స్ చేరుకుని సిబ్బంది అతన్ని చెన్నూర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మహిళను హత్యచేసిన తల్లీ కుమారుడు అరెస్టు

- వివరాలు వెల్లడించిన ఏసీపీ ప్రకాశ్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని మేదరివాడలో గతనెల 29న అర్ధరాత్రి ఓ మహిళను హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించిన తల్లీ కుమారుడిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ ఆర్.ప్రకాశ్ తెలిపారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మేదరివాడకు చెందిన చింత విజయలక్ష్మి(47) భర్త రాంశంకర్ అనారోగ్యంతో కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వివాహమైన తర్వాత అత్తగారింటికి వెళ్లారు. అప్పటి నుంచి విజయలక్ష్మి ఒంటరిగానే ఉంటోంది. రాంశంకర్ మృతి చెందడంతో అతని అన్న చింత వెంకటితో విజయలక్ష్మికి మధ్య ఆస్తి తగదాలు నడుస్తున్నాయి. కొంతకాలం తర్వాత వెంకటి మృతిచెందాడు. ఎలాగైన విజయలక్ష్మిని లేకుండా చేస్తే ఆస్తి మాకే వస్తుందని వెంకటి భార్య లక్ష్మి, కుమారుడు శ్రీకాంత్ భావించారు. గత నెల 29న అర్ధరాత్రి విజయలక్ష్మిపై దాడిచేసి గొంతునులిమి హత్య చేశారు. తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ఉరివేసుకుందని ప్రచారం చేసేందుకు యత్నించారు. విజయలక్ష్మిది హత్య అని, ఆత్మహత్య కాదని ఆమె కూతురు భవిత ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. హత్యకు పాల్పడిన చింత శ్రీకాంత్, లక్ష్మిని శుక్రవారం రైల్వేస్టేషన్‌లో అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఆస్తి కోసమే విజయలక్ష్మిని హత్య చేసినట్లు నిందితులు నేరం ఒప్పుకోగా, వారిని రిమాండ్‌కు తరలించామన్నారు. హత్య జరిగిన నాలుగురోజుల వ్యవధిలో కేసు ఛేదించిన సీఐ బన్సిలాల్, ఎస్సై సనత్‌రెడ్డిని ఏసీపీ అభినందించారు.

ట్రిపుల్‌ఐటీలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్


ట్రిపుల్‌ఐటీ వీసీతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సభ్యులు

భైంసా: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు శుక్రవారం సందర్శించారు. క్యాంపస్‌లో చీఫ్ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కమిషన్ సభ్యులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. ట్రిపుల్‌ఐటీలో పెద్ద సంఖ్యలో ఉన్న బాలికలకు నలుగురే కేర్‌టేకర్లు ఉండడంపై కమిషన్ చైర్మన్ సీరియస్ అయ్యారు. పలువురు విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని కమిషన్ చైర్మన్, సభ్యులకు వినతిపత్రాలు ఇచ్చారు. అంతకుముందు కమిషన్ చైర్మన్ వెంకటయ్య, సభ్యులు కుష్రం నీల, రాంబాబునాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణకుంట ప్రవీణ్ విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. తర్వాత కాన్ఫరెన్స్ హాల్‌లో ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్‌సాగీతో కలిసి పలు అంశాలపై చర్చించారు. విద్యార్థుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్ డాక్టర్ అజయ్‌కుమార్, ఉద్యోగులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీపై ఆరోపణలు!

- ఓయూ జేఏసీ పేరిట కరపత్రం వైరల్
- ఖండించిన మహిళా ఉద్యోగులు

నిర్మల్: బాసర ట్రిపుల్‌ఐటీ(ఆర్జీయూకేటీ) ఇన్‌చార్జి వీసీ వెంకటరమణపై పలు ఆరోపణలతో ఓయూ జేఏసీ పేరిట రెండురోజులుగా ఓ కరపత్రం వైరల్ అవుతోంది. మహిళా ఉద్యోగులపై వేధింపులు, ట్రిపుల్ ఐటీలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ అందులో ఆరోపించారు. ఉన్నత విద్యా మండలి వైస్‌చైర్మన్‌తో పాటు ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీగా జోడు పదవుల్లో ఉన్న ఆయనపై సమగ్ర దర్యాప్తు చేయాలని అందులో డిమాండ్ చేశారు. ఈ విషయమై ‘సాక్షి’ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా ఇన్‌చార్జి వీసీ అందుబాటులోకి రాలేదు.

ఖండించిన ఆర్జీయూకేటీ మహిళా ఉద్యోగులు

ఇన్‌చార్జి వీసీ వెంకటరమణపై సోషల్‌మీడియా వేదికగా వైరల్ అవుతున్నదంతా దుష్ప్రచారమని ఆర్జీయూకేటీ ఉమెన్‌సెల్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు శుక్రవారం ఓ ప్రకటనలో ఖండించారు. స్వార్థపూరిత ప్రయోజనాల కోసం ఉన్నత అధికారులపై నిరాధారమైన అభియోగాలు మోపడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రెండున్నరేళ్లుగా ట్రిపుల్‌ఐటీ కోసం ఆయన కష్టపడుతున్నారని చెప్పారు. మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు పట్ల గౌరవ భావంతో ఉంటున్నారని తెలిపారు. ఇలాంటి ఆరోపణలతో మహిళా ఉద్యోగుల, ఆర్జీయూకేటీ ప్రతిష్టను దిగజార్చవద్దని వారు కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతాం

- పీఆర్టీయూ వ్యవస్థాపకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

నిర్మల్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటానికి పీఆర్టీయూ (తెలంగాణ) పోరాడుతుందని సంఘం వ్యవస్థాపకులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో పీఆర్టీయూ(తెలంగాణ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈసందర్భంగా పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. అనంతరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ఉమ్మడి సర్వీస్‌రూల్స్ సాధిద్దామని, ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్స్, ఎంఈవో, డైట్ లెక్చరర్స్‌కు పదోన్నతులను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. జీవో 317తో నష్టపోయిన వారిని తిరిగి స్థానికత ఇప్పించి, 13 జిల్లాల స్పౌస్ పోస్టింగ్ ఇప్పిస్తామన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేయించి 2003 డీఎస్సీ మెమోను అమలు చేయిస్తామన్నారు. ప్రతీ వేసవిలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టేలా క్యాలెండర్ రూపకల్పన చేయిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను కనీసం 3 అయిన దసరా వరకు ప్రకటించాలన్నారు. రాష్ట్రంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేలా ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఐటీడీఏలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు టైం స్కేల్ ఇప్పించి, కేజీబీవీ వారికి రెండో శనివారం, ఆప్షనల్ హాలిడే ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. వివిధ గురుకులాల్లో పని చేస్తున్న పార్ట్ టైం ఉద్యోగులకు క్రమం తప్పకుండా వేతనాలు ఇప్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న, ప్రధాన కార్యదర్శి చక్రాల హరిప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్‌రావు, నర్సయ్య, గంగయ్య, బాలకృష్ణ, సుదర్శన్, జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

వాంకిడి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక విలేకరి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం.. మండలంలోని ఖిరిడికి చెందిన వద్దూరి సురేశ్(45) వివిధ దినపత్రికల్లో విలేకరిగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ, పిల్లల చదువు భారంగా మారింది. దీంతో మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి మనస్తాపంతో మద్యం మత్తులో గడ్డి మందు తాగాడు. గమనించిన కుమారుడు బైక్‌పై ఆసిఫాబాద్‌కు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు పంపించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. భార్య వనిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.